
సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 18 । మార్చి । 2025



గురుతర బాధ్యతగా.. 8లో

ఉపాధ్యాయులంటే జీవితానికి మార్గదర్శనం చేసేవారే కాదు.. ఉన్నత విలువలు ఆచరణలో చూపేవారు కూడా. ఈ కోవలోకే వస్తారు. ఇవ్వల ప్రసాదరావు, దాడి కొండబాబు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహర్ బుధవారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.48
కాకినాడ	6.22	4.48
అమలాపురం	6.22	4.48

న్యూస్‌రీల్

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 26 ఫిర్యాదులు



ఫిర్యాదీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం(పీజీఆర్ఎస్)ను అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (శాంతిభద్రతలు) ఏవీ సుబ్బరాజు సోమవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి 26 అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి, అర్జీదారుల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. సివిల్, చీటింగ్, కొట్లాట కేసులు, కుటుంబ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి.

క్యాన్సర్ రహిత సమాజం నిర్మిద్దాం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఫార్మాస్యూటికల్స్‌లో నైట్రోసమైన్లను నిర్మూలించడం ద్వారా క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యాన 'కంట్రోల్ ఆఫ్ నిట్రోసామినేష్ ఇన్ ఫార్మాస్యూటికల్స్ అండ్ అనలిటికల్ టెస్టింగ్' అనే అంశంపై సోమవారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. జీవనశైలి, ఆహారం, ధూమపానం, మద్యపానం వంటి వాటితో పాటు కలుషితమైన మందులు కూడా క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని వీసీ అన్నారు. నైట్రోసమైన్ల వంటి కొన్ని విషపూరిత మలినాలు ఆందోళన కలిగించేవిగా నిరూపితమయ్యాయన్నారు. ఈ సందర్భంగా కాన్సినోజెనిక్ పొటెన్సీ కాలిక్యులేషన్స్, రిస్క్ మిటిగేషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ నైట్రోసమైన్స్ ఇన్ ఫార్ములేషన్ అనే అంశంపై అమెరికాకు చెందిన సైజెన్ ఫార్మాస్యూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, నైట్రోసమైన్ కంట్రోల్స్ ఇన్ డ్రగ్స్ సింథసిస్ అనే అంశంపై మలేషియాకు చెందిన ఐఎస్‌టీఐ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ వి.రవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, వివిధ రకాల ఔషధాల్లో నైట్రోసమైన్లు ఉండే అవకాశాలను వివరించారు. ఆన్‌లైన్‌లో అమెరికాకు చెందిన కెమ్ టిక్స్ లాబొరేటరీస్ సైంటిస్టు డాక్టర్ నరేష్ కటారి తదితరులు కూడా ప్రసంగించారు. నన్నయ, గీతం వర్సిటీల నుంచి 12 మంది పోస్టర్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు.

హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.15 లక్షల విరాళం



సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో హెల్త్ సెంటర్ అభివృద్ధికి కాకినాడకు చెందిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ ఎండీ డాక్టర్ తోట సుబ్రహ్మణ్యం రూ.15 లక్షల విరాళం ప్రకటించారు. వర్సిటీలో సోమవారం నిర్వహించిన సెమినార్‌కు హాజరైన ఆయన వర్సిటీ అభివృద్ధి తదితర అంశాలపై వీసీ ఆచార్య ప్రసన్నశ్రీతో చర్చించారు. అనంతరం తన తండ్రి తోట హరిబాబు పేరిట ఈ విరాళం ప్రకటించారు. దాతను ఆచార్య ప్రసన్నశ్రీ ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

రూ.లక్ష విరాళం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణా సేవా సమితికి ముత్తా రామన్న సత్రం ఫౌండర్ ట్రస్టీలు డాక్టర్ ముత్తా వెంకటేష్, ముత్తా ప్రసాద్‌బాబు సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ, కార్యదర్శి కె.సతీష్, ఉపాధ్యక్షుడు వక్కలంక రామకృష్ణకు అందజేశారు.

గూడు.. గోడు



బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చిన ఈమె పేరు గండిపాము మంగ. ఊరు నల్లజర్ల మండలం పోతవరం. ఆమెకు బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలతో కలిపి ఐదుగురు సంతానం. భర్త యేసు కూలి పనులు చేస్తూ బతుకుబండి లాగుతున్నాడు. అత్తమామలు ప్రహరీ కట్టి ఇల్లు ఇచ్చారు. ఆ ఇంటిని పడగొట్టి కొత్తగా ఇల్లు కట్టుకోవాలని మంగ అనుకుంది. అయితే పక్కనే ఉన్న తన బావ, ఆయన కుటుంబ సభ్యులు ఆ స్థలాన్ని ఆక్రమించునేందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి ఎదుట మంగ కన్నీటి పర్యంతమైంది. ఉన్న ఒక్క ఆధారం కోల్పోతే తాము ఎక్కడ నివసించాలని బోరున విలపించింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. దీనిపై విచారణ జరపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పింఛను కోసం..



కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన గుత్తుల వెంకటలక్ష్మి భర్త వెంకటరావు ఏడాదిన్నర క్రితం మృతి చెందారు. గత ప్రభుత్వ హయాంలో ఆయనకు వృద్ధాప్య పింఛను వచ్చేది. భర్త మరణాంతరం పింఛను ఆగిపోవడంతో వెంకటలక్ష్మికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. తనకు కనీసం వితంతు పింఛన్ అయినా వస్తే కుటుంబ పోషణకు చేదోడుగా ఉంటుందని భావించారు. దీని కోసం గ్రామ సచివాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తే న్యాయం జరుగుతుందని భావించి, అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

కాలు లేకున్నా కనికరించరా..?



బీరా రాఘవ

కోరుకొండ మండలం గానుగూడెం గ్రామానికి చెందిన బీర రాఘవ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారు. షుగర్ వ్యాధి కారణంగా కాళ్లకు ఇన్‌ఫెక్షన్ వచ్చింది. ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరగడంతో 2024 మే నెలలో కాలు తొలగించారు. దీంతో వ్యవసాయ పనులు చేయాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం దివ్యాంగ పింఛన్ అయినా వస్తే బతుకుబండి లాగవచ్చని భావించారు. దీని కోసం వైకల్య ధ్రువీకరణ పత్రం సైతం పొందారు. పింఛను మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించే నాథుడే లేడు. ఇప్పటికే రెండుసార్లు అర్జీ ఇచ్చినా పింఛను మంజూరు కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇంకెన్ని రోజులు తిరగాలంటూ వాపోతున్నారు.

కదిలిస్తే.. కన్నీటి వేదన

- సమస్యలపై కలెక్టరేట్‌కు వస్తున్న బాధితులు
- ప్రతి వారం వందలాదిగా అర్జీలు
- పరిష్కారానికి తప్పని నిరీక్షణ
- వ్యయప్రయాసలు పడినా లాభం లేదంటూ నిట్టూర్పు
- ప్రహసనంగా పీజీఆర్ఎస్

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్) ప్రహసనంగా మారుతోంది. తమ గోడు వెళ్లబోసుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న అర్జీదారులకు సకాలంలో, సరైన పరిష్కారం లభించడం లేదు. సమస్యలపై జిల్లా స్థాయి అధికారులకు వినతులిస్తుండగా.. వారు ఆయా శాఖల అధికారులకు అప్పగించి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో తమ బాధలు చెప్పుకునేందుకు పలువురు అర్జీదారులు కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎవరిని కదిలించినా కన్నీటి వేదనే వినిపించారు. తమ సమస్యలు తీర్చేవారే లేరంటూ నిట్టూర్చారు.

భూ సమస్యలపై అర్జీల వెల్లువ

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అత్యధిక శాతం అర్జీలు రెవెన్యూ సమస్యల పైనే వస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రతి వారం సుమారు 200 అర్జీలు వస్తుండగా.. వీటిలో 80 శాతం రెవెన్యూ సమస్యలే. మిగిలిన 20 శాతం రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల మంజూరు, తొలగించిన పింఛన్ల పునరుద్ధరణ, పోలీస్, ఇతర శాఖల సమస్యలపై వస్తున్నాయి. గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే బాధితులకు వ్యయప్రయాసలు తప్పడం లేదు.



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

మరికొన్ని వినతులు

- ధవళేశ్వరానికి చెందిన పి.కోటకు గతంలో వితంతు పింఛను మంజూరు చేసి, ప్రస్తుతం చెప్పా పెట్టకుండా పింఛను ఆపేశారు. పిల్లల్ని పోషించడం కష్టంగా ఉందని, అధికారులు కరుణించి, పింఛన్ పునరుద్ధరించాలని వేడుకున్నారు.
- సీతానగరం మండలం రామచంద్రపురం వీఆర్‌ఓ టి.పుల్లారావు అనారోగ్య కారణాలతో 2021 నుంచి విధులకు హాజరు కావడం లేదు. ఆయనకు రావాల్సిన జీతం మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు అర్జీ ఇచ్చారు.

గత ఏడాది జూన్ 15 నుంచి వచ్చిన అర్జీల వివరాలు

అధికారులు స్వీకరించినవి	22,241
పరిష్కరించినవి	20,579
రీ ఓపెన్ చేసిన అర్జీలు	871
పరిష్కరించినవి	803
ఎక్కువగా వస్తున్న అర్జీలు రీసర్వే	(80 శాతం)
ఇతర సమస్యలపై	20 శాతం

- ఈ వివరాలు చూస్తుంటే చాలా వరకూ సమస్యలు పరిష్కారమైనట్లు కనిపిస్తోంది. అయితే, సమస్య ఆన్‌లైన్‌లో పరిష్కారమైనట్లు చూపిస్తున్నారే తప్ప.. తమకు సాంత్వన చేకూరడం లేదని బాధితులు వాపోతున్నారు.

దివ్యాంగ పింఛను ఇప్పించండి



పుట్టుకతోనే నాకు వైకల్యం. టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తూ, ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నా. పింఛను మంజూరు చేయాలని ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. సదరం సర్టిఫికెట్ **పొందినా పింఛను మా**త్రం ఇవ్వడం లేదు.

– నక్రే దుర్గాప్రసాద్, ధవళేశ్వరం

రెండుసార్లు అర్జీ ఇచ్చినా..



కుటుంబ పెద్ద చనిపోయారు. పోషణ భారమైంది. వితంతు పింఛను మంజూరు చేయాలని రెండుసార్లు అర్జీ ఇచ్చినా ఫలితం లేదు. రేషన్ కార్డు, ఇంటి స్థలం కోసం ఇచ్చిన వినతులు కూడా బుట్టదాఖలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ఆదుకోవాలి.

– రుద్రపాటి ముత్యవేణి, ధవళేశ్వరం

చీకట్లో మగ్గుతున్నాం



మా ఊళ్లో జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకున్నాం. గృహ ప్రవేశం చేశాం. నేను దివ్యాంగురాలిని. నా 18 ఏళ్ల కుమారుడు ప్రశాంత్ సైతం దివ్యాంగుడు. విద్యుత్ కనెక్షన్ కోసం గ్రామ సచివాలయంలో రూ.1,800 చెల్లించి, దరఖాస్తు చేసుకుందామని వెళ్లాం. అప్లికేషన్ తీసుకోవద్దని లైన్‌మన్ చెప్పాడని కార్యాలయంలో చెబుతున్నారు. నా కుమారుడితో పాటు చీకట్లో మగ్గుతున్నా. డబ్బులు చెల్లిస్తామన్నా విద్యుత్ కనెక్షన్ ఎందుకివ్వడం లేదో అర్థం కావడం లేదు. న్యాయం చేయాలంటూ కలెక్టర్‌లో వినతిపత్రం సమర్పించా.

– పలివెల భవాని, దివ్యాంగురాలు, నందరాడ, రాజానగరం మండలం

మరుగుదొడ్డి కూల్చేశారు



మా ఊళ్లో నాకు సొంతిల్లు ఉంది. రోడ్డు వేయాలంటూ సర్పంచ్, పంచాయతీ అధికారులు, కొంతమంది వచ్చి మా స్థలంలోని మరుగుదొడ్డి, మెట్లను జేసీబీతో కూల్చేశారు. ఈలోగా 112కి ఫోన్ చేస్తే కానిస్టేబుల్ వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేలోపు ఈ నెల 14వ తేదీ రాత్రి మరుగుదొడ్డిని జేసీబీతో పగులగొట్టి సామగ్రి పట్టుకుపోయారు. పోలీసులను ఆశ్రయిస్తే సివిల్ కేసుతో తమకు సంబంధం లేదని చెప్పారు. జరిగిన అన్యాయంపై ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తోచని పరిస్థితుల్లో కలెక్టరేట్‌కు వచ్చాం. మరుగుదొడ్డిని కూల్చిన వారిపై చర్యలు తీసుకుని, తిరిగి నా స్థలంలో మరుగుదొడ్డి నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చా.

– పెద్దింటి అనంతలక్ష్మి, చంద్రవరం, చాగల్లు మండలం

డయేరియా విజృంభణ

- రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆసుపత్రి
- వరండాల్లోనే మంచాల ఏర్పాటు
- 35 మందికి సోకిన వ్యాధి
- నమోదవుతున్న కొత్త కేసులు

దేవరపల్లి: గోపాలపురం మండలంలోని పలు గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోంది. నాలుగు రోజులుగా పలువురు వాంతులు, విరేచాలతో బాధ పడుతూ గోపాలపురంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి రోగుల తాడికి ఎక్కువ కావడంతో మంచాలు చాలక వరండాల్లోనే మంచాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. మండలంలోని సుమారు 12 గ్రామాల్లో డయేరియా సోకినట్లు సమాచారం. గోపాలపురం, వేళ్లచింతలగూడెం, చిట్యాల, పెద్దాపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, అన్నదేవరపేట తదితర గ్రామాల నుంచి సుమారు 35 మంది డయేరియా బాధితులు గోపాలపురం ఆసుపత్రిలో చేరారు. వీరిలో సుమారు 20 మంది కోలుకొని ఇళ్లకు వెళ్లగా, 15 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం కొత్తగా 9 కేసులు నమోదవడంతో ప్రజలు కలవరపడుతున్నారు. ఆసుపత్రి నుంచి వెళ్లేవారు వెళుతుండగా, వచ్చేవారు వచ్చి చేరుతున్నారు. పొగాకు పనులు, పంటలకు పిచికారీ చేస్తున్న పురుగు మందులు గాలిలో కలడవం, ఎండల తీవ్రతతో డీహైడ్రేషన్ వంటి వాటితో డయేరియా సోకి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే, పరిస్థితి తీవ్రంగా ఉంటే అధికారులు మాత్రం వాస్తవాలను దాచిపెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ

డయేరియా వ్యాప్తి నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ఆగమేఘాలపై గోపాలపురం ఆసుపత్రికి చేరుకుని రోగులను పరామర్శించి, వైద్యులకు తగు సూచనలిచ్చారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. రెండు రోజులుగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. డయేరియా లక్షణాలు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొగాకు పనుల వల్ల డయేరియా సోకినట్టు అధికారులు చెబుతున్నారని, కానీ పనులకు వెళ్లకుండా ఇళ్లల్లో ఉన్న వారికి కూడా వచ్చిందని గోపాలపురం గ్రామస్తులు చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కంపు కొడుతున్న డ్రైనేజీలు, కలుషితమవుతున్న మంచినీటి సరఫరా వంటి కారణాలతో గ్రామాల్లో డయేరియా ప్రబలిందని చెబుతున్నారు.



గోపాలపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

ఆందోళన వద్దు : కలెక్టర్

గోపాలపురం: మండలంలో డయేరియా అదుపులోనే ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గోపాలపురం సీహెచ్‌సీలో చికిత్స పొందున్న డయేరియా బాధితులను సోమవారం ఆమె, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును రోగులను అడిగి తెసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ. వివిధ గ్రామాల నుంచి వచ్చిన డయేరియా బాధితులకు సత్వర చికిత్స అందిస్తున్నామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటి వరకూ 25 మంది చికిత్స పొందగా 20 మంది డిశ్చార్జి అయ్యారని, కొత్తగా 9 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. డయేరియా కేసులను గుర్తించేందుకు వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారన్నారు. గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో అక్కడక్కడ డయేరియా కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాలలో వాటర్ ట్యాంకులు, స్టోరేజీ ట్యాంకుల క్లోరినేషన్ చేపట్టామన్నారు. ప్రజలకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులు అందుబాటులో ఉంచామన్నారు. వాతావరణ మార్పులు, వడగాల్పులతో డయేరియా వ్యాప్తి చెందుతున్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయి పరిశీలనకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం డయేరియా కేసులు నమోదైన గోపాలపురం, పెద్దగూడెం, చిట్యాల, పెద్దాపురం, వేళ్లచింతగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను కలెక్టర్ ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి ఎస్వీ పద్మశ్రీ తదితరులు పరిశీలించారు.



గోపాలపురం సీహెచ్‌సీలో డయేరియా బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

ప్రశాంతంగా ప్రారంభం

- మొదలైన పదో తరగతి పరీక్షలు
- 23,523 మంది హాజరు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 134 కేంద్రాల్లో పేపర్–1లో తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు జరిగాయి. పరీక్షల తొలి రోజు కావడంతో ఏ కేంద్రం వద్ద చూసినా విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడే కనిపించింది. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకుని, తమ హాల్ టికెట్ నంబర్ ఆధారంగా రూములు వెతుక్కున్నారు. ఉదయం 9.30కు పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు మొత్తం 23,984 మందికి గాను 23,523 మంది హాజరయ్యారు. ఒక పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, 11 కేంద్రాలను జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు, 64 కేంద్రాలను తనిఖీ అధికారులు సందర్శించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మూయించివేశారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఓఆర్ఎస్, ప్రాథమిక వైద్య సహాయం అందించేలా ఏర్పాట్లు చేశారు.

జాగ్రత్తలు తీసుకోండి

పదో తరగతి పరీక్షల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు మున్సిపల్ హైస్కూలును ఆమె, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు కూడా పాల్గొన్నారు.



డీఎంహెచ్ స్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పరీక్ష రాస్తున్న దివ్యాంగురాలు



పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష రాసేందుకు డీఎంహెచ్ స్కూల్‌లోకి క్యూలో వెళ్తున్న విద్యార్థులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

బాలిక అదృశ్యం

గోపాలపురం: ఇంట్లో నిద్రపోయిన బాలిక మరుసటి రోజు ఉదయం నుంచి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, గోపాలపురం మండలం భీమోలు పంచాయతీలోని తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్కా కిషోర్‌బాబు, గంగ దంపతులు శనివారం రాత్రి పది గంటలకు కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి వారి కుమార్తె(17) కనిపించలేదు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

గురుతర బాధ్యతగా..

- సామాజిక సేవలో తరిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ప్రసాదరావు
- సేవా కార్యక్రమాలకు ఏటా ఓ నెల జీతం కేటాయింపు
- మూడున్నర దశాబ్దాలుగా ఇదే బాట

ఉపాధ్యాయుడు.. అంటే జీవితానికి దిక్సూచి. ఓ మార్గదర్శి. గమ్యమేంటో తెలియని బాల్యానికి లక్ష్యాన్ని నిర్దేశించే గురువు. ఇంతటి గురుతర బాధ్యతను మోస్తున్న ఉపాధ్యాయుడు.. ఆదర్శాలను పాటించాలని బోధించడమే కాదు.. తానూ ఆచరించి సమాజానికి 'గుణ'పాఠాలు నేర్పడం గర్వించదగిన విషయం. అలాంటి ఉన్నత విలువలు కలిగిన ఉపాధ్యాయులూ ఎక్కడో అరకొరగా దర్శనమిస్తుంటారు ఇవ్వల ప్రసాదరావు, దాడి కొండబాబు లాంటివారు.

కరప: ఏదో రకంగా ఆస్తులు కూడబెట్టుకోవాలనుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. కష్టార్జితంలో ఏటా ఓ నెల జీతాన్ని సామాజిక సేవకు వినియోగిస్తూ ఆదర్శప్రాయంగా నిలిచారు కరప మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు(సాంఘిక శాస్త్రం) ఇవ్వల ప్రసాదరావు. అలాగని ఆర్థికంగా ధనవంతుడేమీ కాదు. వారసత్వంగా ఆస్తిపాస్తులూ లేవు. కేవలం నెలవారీ జీతంతో కుటుంబాన్ని పోషిస్తూనే, సేవా కార్యక్రమాలకు సొంత ధనాన్ని వెచ్చించడం విశేషం. ఉన్నంతలో పేదలకు సాయం అందించాలన్న దృక్పథం ఒకవైపు, మహాత్మా గాంధీ, మదర్ థెరిసా, స్వామి వివేకానందుడు వంటి మహోన్నతుల ప్రేరణతో సామాజిక సేవ చేస్తున్నట్టు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతైన ప్రసాదరావు తెలిపారు. తన సేవా కార్యక్రమాలను ప్రసాదరావు తెలిపారు.

కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన ఇవ్వల ప్రసాదరావు ఎంఏ, బీఈడీ చదివారు. 1989లో ఉపాధ్యాయుడిగా కాజులూరు మండలం రేగుబాడవలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జాతీయ నాయకుల ప్రేరణతో ఉద్యోగంలో చేరిన రోజే ప్రతి ఏటా ఓ నెల జీతాన్ని సామాజిక సేవకు వినియోగించాలని దృఢ నిర్ణయం తీసుకున్నారు. తొలుత రూ.398 జీతంతో ఉద్యోగంలో చేరారు. అదే ఏడాది నుంచి రూ.398తో సామాజిక సేవ ప్రారంభించిన ప్రసాదరావు ప్రస్తుతం సేవా కార్యక్రమాలకు రూ.లక్ష వరకూ ఖర్చు చేస్తున్నారు.



ఇవ్వల ప్రసాదరావు, ఉపాధ్యాయుడు

మహాత్ముని ఆశయాల కోసం..

భవిష్యత్తు తరాలు బాగుండాలంటే గాంధీ మహాత్ముని ఆశయాలు సత్యం, ధర్మం, అహింస వంటి భావాలు విద్యార్థుల్లో పెంపొందించేందుకు జిల్లావ్యాప్తంగా తాను పనిచేసిన మండలాల్లోని 26 పాఠశాలల్లో గాంధీజీ విగ్రహాలను సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. వేళంగి హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని నెలకొల్పారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకినాడ చర్చిస్కేర్ వద్ద ఉన్న జూనియర్ కళాశాలల్లో గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడులో 22 ఏళ్లు పని చేసిన ఆయన అక్కడి విద్యార్థులకు ఐడీ కార్డులు, పలకలు, పుస్తకాలు, పెన్నులు, బోధనా పరికరాలు, అభ్యసనా సామగ్రి అందజేశారు. ప్రత్తిపాడు యూపీ స్కూల్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్ది అందరి ప్రశంసలు పొందారు. 2004లో బాలికల గ్రిగ్స్ క్రీడలకు 30 రోలింగ్ షీల్డ్స్ అందించి, ఆనాటి ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేల ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2005లో అప్పటి డీఈఓ ప్రసన్నకుమార్, జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, ఎంపీ వంగా గీత ద్వారా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్నారు. అనేక సార్లు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ, స్మారక అవార్డులూ అందుకున్నారు.

నగదు ప్రోత్సాహకాలు

తర్వాత కాజులూరు మండలం మంజేరు హైస్కూలులో ప్రసాదరావు పదేళ్లు పనిచేయగా, ఏటా టెన్త్‌లో ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.1,116 నగదు ప్రోత్సాహకం అందించారు. కరోనా సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సుమారు 40 మండలాల్లో రూ.1.50 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు, మాస్కులు, శానిటైజర్లు అందజేశారు. 2021 నుంచి పనిచేస్తున్న గురజనాపల్లి హైస్కూలులో ప్రతి తరగతి గదికి వాల్‌క్లాక్, వివిధ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. రూ.15 వేల విలువైన మైక్‌సెట్‌ను సమకూర్చారు. హెచ్‌ఎం గదిలో రూ.15 వేలతో జాతీయ నాయకుల చిత్రపటాలను ఏర్పాటుచేశారు. ఇటీవల రూ.70 వేలతో మహాత్మా గాంధీ, పూర్వ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, భారతరత్న అబ్దుల్‌కలాం విగ్రహాలను నెలకొల్పారు. పాఠశాలలో రూ.15 వేల వ్యయంతో ప్లాంటేషన్ చేయించారు. దశాబ్ద కాలంగా టెన్త్ విద్యార్థులకు సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు. పలువురు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నారు. గత 36 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా, ఆ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి విశేష కృషి చేస్తున్నారు.



కాకినాడలోని ఓ ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న ప్రసాదరావు (ఫైల్)



పేదలకు నిత్యావసరాలు అందజేస్తూ.. (ఫైల్)



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రసాదరావు (ఫైల్)



గురజనాపల్లి హైస్కూలు తరగతి గదిలో ఏర్పాటుచేసిన పటాలు

సంఘ పరంగా..

జిల్లాలోని ఐదు వేల మంది ఉపాధ్యాయులకు ప్రసాదరావు సర్వీసు రిజిస్టర్ల సేవలందించారు. యూటీఎఫ్‌కు రాష్ట్ర కౌన్సిలర్‌గా, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సేవలందించారు. ప్రస్తుతం కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షుడిగా ఉన్నారు. అలాగే వివిధ సందర్భాల్లో అనాథాశ్రమంలో వృద్ధులకు సాయం చేస్తుంటారు. ఎన్ని ఒడిదుడుకులెదురైనా ఉద్యోగ విరమణ వరకూ నెల జీతం సామాజిక సేవకు కేటాయిస్తానని ప్రసాదరావు తెలిపారు.

అంధ విద్యార్థినికి వెలుగు రేఖగా..

- చదువుకు దత్తత తీసుకున్న ఉపాధ్యాయుడు
- జీవితంలో నిలదొక్కుకునే వరకూ అండగా ఉంటానని భరోసా

కోటనందూరు: తల్లిదండ్రులు కడు పేదవారు. వారి కుమార్తె పుట్టుకతోనే అంధురాలు. కుటుంబ నిర్వహణే కష్టంగా ఉన్న ఆ తల్లిదండ్రులు తమ బిడ్డను ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తున్నారు. చీకటి అలముకున్న బాలిక జీవితంలో ఓ ఉపాధ్యాయుడు కొత్త వెలుగులు నింపాడు. ఆమె విద్యాబుద్ధులను భుజాన వేసుకుని.. జీవితంలో నిలదొక్కుకునే వరకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని బంగారయ్యపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కొమ్మాకుల వెంకట కుసుమదేవి పుట్టుకతోనే అంధురాలు. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈమె ప్రస్తుతం బిళ్లనందూరు ఎంపీ యూపీ పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. కోటనందూరులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దాడి కొండబాబు వర్క్ అడ్జస్ట్‌మెంటులో భాగంగా ఈ ఏడాది బిళ్లనందూరు పాఠశాలకు వెళ్లారు. అక్కడ వెంకట కుసుమదేవి వైకల్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఆయన తెలుసుకున్నాడు. దీంతో ఆమె చదువు బాధ్యతను కొండబాబు తన భుజాన వేసుకున్నారు. ఉన్నత చదువు పూర్తి చేసి, ఉద్యోగం సాధించే వరకూ ఆర్థికంగా అండగా ఉంటానని సంకల్పించారు. ఇందులో భాగంగా బ్రెయిలీ లిపి నేర్చుకోడానికి అవసరమైన బ్రెయిలీ స్లేట్, స్టైలస్ తదితర మెటీరియల్ కొనిచ్చి, నేర్పిస్తున్నారు. బ్రెయిలీ నిపుణుల సహకారంతో కుసుమకు ప్రత్యేకంగా విద్యా బోధన చేస్తున్నట్టు కొండబాబు మాస్టారు వివరించారు. ఆ బాలికను ఉన్నత స్థితికి చేర్చేందుకు అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తున్నట్టు చెప్పారు. ఆ విద్యార్థినికి అండగా ఉంటూ, పలువురికి ఆదర్శంగా నిలిచిన కొండబాబు మాస్టారుని ఎంఈఓలు ఏవీఎస్ శ్రీనివాస్, ఎంవీ రామశేఖర్, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.



వెంకటకుసుమదేవికి బ్రెయిలీ స్లేట్ అందిస్తున్న కొండబాబు మాస్టారు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తుని: రేగుపాలెం–ఎలమంచిలి స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడిన సంఘటనలో సుమారు 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయనకు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుపు, నీలం, నలుపు గడుల పొట్టి చేతుల చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి, మాసిన గెడ్డంతో ఉన్నాడు. మెడలో తాయెత్తులు ఉన్నాయి. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు తుని జీఆర్పీ పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

– ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు రైతుల వినతి

సాక్షి, అమరావతి: కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోకో రైతుల సంఘం డిమాండ్ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ ధరకు కంపెనీలు కొనుగోలు చేయడం వలన తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు, కోకో రైతుల సంఘాల ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షలో కంపెనీల మాయాజాలంతో ఎలా నష్టపోతున్నారో పలువురు కోకో రైతులు వివరించారు. ఏపీ కోకో రైతు సంఘం ప్రతినిధులు ఎస్.గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ, కోనేరు సతీష్‌బాబు, గుదిబండి వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలోకు రూ.700కు పైగా పలుకుతుండగా, రాష్ట్రంలో కంపెనీలు మాత్రం కిలో రూ.550–రూ.600కు మించి చెల్లించడం లేదన్నారు. గ్రేడింగ్ పేరిట అడ్డగోలుగా ధర తగ్గించడం వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి సీజన్, అన్ సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే, వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీంను కోకో రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ, తప్పకుండా కోకో రైతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సంఘ ప్రతినిధులు డైరెక్టర్‌కు అందజేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రతినిధులతో పాటు, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కోకో రైతులు పాల్గొన్నారు.

కాలువలో యువకుడి గల్లంతు



గెడ్డం కార్తీక్ (ఫైల్)

కడియం: మండలంలోని జేగురుపాడు వద్ద కాలువలో గెడ్డం కార్తీక్(19) గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల మేరకు, కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం తోకలంకకు చెందిన గెడ్డం కార్తీక్ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం జేగురుపాడుకు చెందిన అతడి స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. అనంతరం వారంతా కలిసి కాలువలో స్నానానికి దిగారు. అందరూ బయటకు వచ్చినప్పటికీ, కార్తీక్ రాలేదు. దీంతో స్థానికులతో కలిసి మిత్రులంతా గాలింపు చేపట్టినా, అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కార్తీక్ తల్లిదండ్రులు, కడియం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కార్తీక్ ఆచూకీ కోసం కాలువ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

పంట కాలువలో మృతదేహం

ఉప్పలగుప్తం: అమలాపురం చల్లపల్లి ప్రధాన పంట కాలువలో సరిపల్లి గ్రామ పరిధిలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైందని ఎస్సై సీహెచ్ రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు, మృతదేహాన్ని వెలికితీశామని చెప్పారు. మృతునికి 50– 55 ఏళ్ల వయస్సు ఉంటుందని చెప్పారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కడలి చెరువులో..

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ పరిధిలోని కడలి చెరువులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లకు పైగా ఉండవచ్చు. ఈ మేరకు స్థానికులు నగరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సమీప పోలీస్ స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను ఆరా తీస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు: రామచంద్రపురం మండలం నేలపర్తిపాడు గ్రామానికి చెందిన వల్లూరి సురేష్‌బాబు(50) రైలు ఢీకొన్న ఘటనలో మృతి చెందినట్టు సామర్లకోట రైల్వే ఎస్సై పి.వాసు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు, ఆదివారం రాత్రి బిక్కవోలు–పెదబ్రహ్మదేవం గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ దాటుతున్న అతడిని గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మృతి చెందాడన్నారు.

ఉయ్యాల తాడే.. ఆమెకు ఉరితాడు

- మద్యానికి బానిసైన భర్త నిర్వాకంతో వివాహిత బలవన్మరణం
- తల్లిని కోల్పోయిన చిన్నారులు

కాకినాడ క్రైం: అల్లారుముద్దుగా చూసుకుంటున్న తన బిడ్డను నిద్రపుచ్చేందుకు కట్టిన ఉయ్యాల తాడుతోనే.. ఆ తల్లి ఉరి వేసుకుని శాశ్వత నిద్రలోకి జారుకుంది. మద్యానికి బానిసైన భర్త వైఖరి.. అభంశుభం తెలియని ఇద్దరు బిడ్డల భవిష్యత్తు ఏమైపోతుందోననే ఆందోళన.. జీవితాన్ని ఎదుర్కొలేనేమోనన్న నిస్సహాయత వెరసి.. ఎన్నో కలలు గన్న ఆ వివాహిత తన నూరేళ్ల జీవితాన్ని అర్థంతరంగా ముగించి తనువు చాలించింది. ఎన్నో కలలు చూపించి, ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్తకు మద్యం ముందు భార్యాబిడ్డలు ఆనకపోవడంతో.. తమ మరణంతోనైనా భర్తకు కనువిప్పు కలుగుతుందనుకుంటూ తనకు తాను మరణ దండన విధించుకుంది. తన ఇద్దరు బిడ్డలకు తల్లి ప్రేమను శాశ్వతంగా దూరం చేసి, జీవితాంతం గుండెకోత మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



పిల్లలతో స్వాతి (ఫైల్)

జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొట్టేడు స్వాతి(26)కి 2017లో కాకినాడకు చెందిన తలాటం సురేష్‌తో వివాహమైంది. వీరిది ప్రేమ వివాహం. కార్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న సురేష్ పెళ్లయిన తొలి నాళ్లలో భార్యతో బాగానే ఉండేవాడు. మద్యం అలవాటు శ్రుతి మించడంతో కొంతకాలం తర్వాత భార్యను పట్టించుకోవడం మానేశాడు. వీరికి నాలుగేళ్ల బాబు, ఎనిమిది నెలల పాప ఉన్నారు. నిత్యం మద్యం మత్తులో జోగుతూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అతడి వైఖరితో స్వాతి తీవ్ర అసహనంతో ఉండేది. ఎంత నచ్చజెప్పినా సురేష్‌లో మార్పు రాలేదు. స్నేహితులతో కలిసి తాగుబోతులా మారాడని తల్లిదండ్రుల వద్ద స్వాతి బాధపడుతుండేది. ఈ క్రమంలో దంపతుల మధ్య వాదులాటలు జరిగేవి. ఆదివారం అర్ధరాత్రి మద్యం తాగొచ్చిన సురేష్.. భార్యాపిల్లలు పడుకున్న గదిలో నిద్రపోయాడు. భర్త రాకను స్వాతి గమనించి, ఇంతేనా జీవితం అంటూ ప్రశ్నించింది. దీంతో సురేష్ భార్యతో గొడవ పడ్డాడు. ఇలాగే ఉంటే తమ పిల్లల సంగతేంటని ప్రశ్నించడంతో, సురేష్ తిరగబడ్డాడు. దీంతో విసుగెత్తిన స్వాతి సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బలవన్మరణానికి పాల్పడింది. పిల్లల కోసం కట్టిన ఉయ్యాల తాడునే ఉరితాడుగా మార్చుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె సోదరుడు నగేష్ ఫిర్యాదుతో కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పది' పరీక్షల హాలులో సిమెంట్ బస్తాలు

- విద్యార్థులను నిలిపి, బస్తాల తొలగింపు
- నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షా కేంద్రంలోని ఒక గదిలో సిమెంటు బస్తాలు నిల్వ ఉంచడం.. విద్యార్థులు వచ్చిన తర్వాత వాటిని తొలగించడానికి చర్యలు చేపట్టడంపై వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలివీ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని నల్లవంతెన వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని రూమ్ నంబర్ ఏడులో 22 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. బ్లాక్ బోర్డు, బెంచీలపై నంబర్లు కూడా రాశారు. ఇదిలా ఉండగా పలు పాఠశాలల్లో నిర్మాణ పనులకు అవసరమైన సిమెంటు బస్తాలను ఈ స్కూలును స్టాక్ పాయింట్‌గా ఉపయోగిస్తూ, ఇదే గదిలో నిల్వ ఉంచారు. సోమవారం ఉదయం నుంచి టెన్త్ పరీక్షలు మొదలవుతున్నాయని తెలిసి కూడా వీటిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పరీక్షల నిర్వహణాధికారులు అలాగే ఉంచేశారు. ముందు రోజో లేదా పరీక్షలు రాసేందుకు వచ్చేలోగానో ఆ బస్తాలను అక్కడి నుంచి తొలగించి ఉండాల్సింది. కానీ, పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఈ గదికి వచ్చేసరికి కూలీలతో సిమెంట్ బస్తాలను బయటకు తీసుకుని వస్తున్నారు. ఆ దృశ్యాలను చూసి, విద్యార్థుల తల్లిదండ్రులు అసహనానికి గురయ్యారు. పరీక్షల నిర్వహణపై ఇంత నిర్లక్ష్యమేమిటని ఆగ్రహించారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులను తరగతి గది బయట నిలబెట్టి, సిమెంట్ బస్తాలు బయటకు తీసుకురావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం తెలియడంతో జిల్లా విద్యా శాఖాధికారి షేక్ సలీమ్ బాషా వెంటనే ఈ పాఠశాలను సందర్శించారు. సిమెంట్ బస్తాలు పాడవకూడదనే ఉద్దేశంతోనే వాటిని ప్రధానోపాధ్యాయుడు తరగతి గదిలో ఓ మూల భద్రపరిచారని చెప్పారు. పరీక్ష ప్రారంభం కాకముందే సిమెంట్ బస్తాల తొలగింపు చేపట్టారని తెలిపారు.



సిమెంట్ బస్తాలు తొలగిస్తున్న కూలీలు

అన్నా హజారే దృష్టికి పర్యావరణ విధ్వంసం



అన్నా హజారేకు వినతిపత్రం ఇస్తున్న ధర్మారావు

తాళ్లరేవు: విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు జరుగుతున్న తీవ్ర పర్యావరణ విధ్వంసాన్ని పరిష్కరించడంలో మార్గదర్శకత్వాలు ఇవ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త, పర్యావరణవేత్త అన్నా హజారేకు వైల్డ్‌హోప్ హేబిటాట్స్ ఓషన్స్ వలంటీర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సంగాడి ధర్మారావు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలు, ముఖ్యంగా చమురు శుద్ధి, రసాయన కర్మాగారాలు చట్టాలను ఉల్లంఘిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలుష్యం కారణంగా కోరింగ వన్యప్రాణుల అభయారణ్యం, కోస్టల్ రెగ్యులేటరీ జోన్, ఎకో సెన్సిటివ్ జోన్‌లో మడ అడవులను క్రమపద్ధతిలో నాశనం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో సంచరించే ఆలివ్ రిడ్లే తాబేళ్ల సామూహిక మరణాలు, వలస పక్షుల క్షీణత, అరుదైన వృక్ష, జంతుజాలాలు అంతరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. దీని పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్టు ధర్మారావు తెలిపారు.

మహిళ మరణంపై వివాదం

కాకినాడ అపోలో ఆసుపత్రిలో ఘటన

కాకినాడ క్రైం: చికిత్స పొందుతూ మృతి చెందిన ఓ మహిళ మరణం వివాదాస్పదమైంది. కాకినాడ అపోలో ఆసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే, తుని అర్బన్ మండలం హంసవరానికి చెందిన మహిళ పోతుల పాప(50) శ్వాసకోశ సమస్యతో ఈ నెల 12వ తేదీన కాకినాడ అపోలో ఆసుపత్రిలో చేరింది. ఐసీయూలో చికిత్స పొందిన ఆమెను జనరల్ వార్డుకి మార్చారు. ఆరోగ్య స్థితి విషమిస్తుండడంతో మరోమారు ఐసీయూకి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సోమవారం తరలిస్తుండగా మృతి చెందింది. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే పాప చనిపోయిందని కుటుంబీకులు ఆరోపించారు. నిరాటంకంగా ఆక్సిజన్ అందాల్సి ఉండగా, సిలిండర్ అయిపోయిన వెంటనే మరొకటి అనుసంధానం చేయలేదని, అందువల్ల ప్రాణవాయువు అందక పాప మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణం చోటు చేసుకుందని కుటుంబీకులు ఆందోళనకు దిగారు. సకాలంలో ఆక్సిజన్ సిలిండర్ అనుసంధానం చేయకపోవడం వల్లే నిండు ప్రాణం పోయిందని ఆరోపిస్తూ, యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై యాజమాన్యం వివరణ ఇస్తూ, పాప తీవ్ర శ్వాసకోశ సమస్యతో అపోలోలో చేరిందన్నారు. రెండు రోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందించామని, తర్వాత కుటుంబీకుల విన్నపం మేరకు వార్డులో చేర్చి చికిత్స అందించామన్నారు. మహిళలో మధుమేహంతో పాటు టీబీ గుర్తించామనీ, ఈ నేపథ్యంలో ఆరోగ్యం విషమించిందని తెలిపారు. రోగికి నిరంతరం ఆక్సిజన్ సరఫరా కొనసాగిందని సిలిండర్‌ను మార్చే వ్యవధిని తప్పుగా అర్థం చేసుకున్న కుటుంబీకులు ఆక్సిజన్ అనుసంధానించలేదని అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారన్నారు. శ్వాస నిలిచిపోయిన స్థితితో తమ వైద్య బృందాలు సీపీఆర్ చేసి ప్రాణం నిలిపారని, కాసేపటికి కార్డియాక్ అరెస్ట్ కావడంతో ప్రాణాలు కాపాడలేకపోయామని తెలిపారు. వార్డు నుంచి ఐసీయూకు తరలించే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మృతురాలి కుటుంబీకులు కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.